నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 25 మే 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

నిర్లక్ష్యపు డ్రైవింగ్ వద్దు

రామగుండం సీపీ శ్రీనివాస్

కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

మంచిర్యాల ఏసీసీ, మే 24 : నిర్లక్ష్యపు డ్రైవింగ్ సరికాదని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న 50 మంది డ్రైవర్స్ (సిబ్బంది)కు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ వాహనాలను ఎప్పటికప్పుడు కండిషన్‌లో ఉంచుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల 1,69,000 మంది ప్రాణాలు కోల్పోయారని, 4 లక్షల మంది క్షతగాత్రులు అయ్యారని తెలిపారు. నిమిషానికో రోడ్డు ప్రమాదం జరుగుతుందన్నారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐ ఎంటీవో మధు, ఆర్ఐలు మల్లేశం, శ్రీనివాస్, రామగుండం ఎంవీఐ మధు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

అటవీ అధికారులను అడ్డుకున్న పోడు రైతులు

అటవీ శాఖ అధికారులను అడ్డుకుంటున్న రైతులు

కాగజ్‌నగర్, మే 24: కాగజ్‌నగర్ మండలం అంకుసాపూర్ గ్రామ శివారులోని అటవీ భూముల్లో హద్దులు ఏర్పాటు చేసేందుకు వచ్చిన ఫారెస్ట్ అధికారులను పోడు రైతులు శుక్రవారం అడ్డుకున్నారు. కాగజ్‌నగర్ రేంజ్ పరిధిలోని కంపార్ట్‌మెంట్ 69లో దాదాపు 50 మంది రైతులు వ్యవసాయం చేసుకుంటుండగా, డిప్యూటీ రేంజ్ అధికారి శశిధర్ హద్దు బోర్డులు ఏర్పాటు చేయాడానికి రాగా రైతులు అడ్డుకున్నారు. కొన్నేళ్లుగా ఇక్కడ వ్యవసాయం చేసుకుంటున్నామని, పట్టా పాసుబుక్‌లు సైతం ఉన్నాయని చూపించారు. యేటా తమను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని, రెవెన్యూ, అటవీ శాఖ జాయింట్ సర్వే నిర్వహించి తమకు న్యాయం చేయాలని కోరారు. దీంతో చేసేదేమీ లేక అటవీ శాఖ అధికారులు వెనుదిరిగారు.

లక్ష్యం కష్టమే!

ధాన్యం సేకరణకు సహకరించని మిల్లర్లు

- అధికారులు చెప్పినా లారీలు అన్‌లోడింగ్ చేయని వైనం
- ప్రతి బస్తాలో 43 కిలోలు ఉంటేనే తీసుకుంటామంటూ స్పష్టం
- లేదంటే రోజుల తరబడి తప్పని నిరీక్షణ
- ఇప్పటి వరకు కొన్నది 1.08 లక్షల టన్నులే
- ఈ ఐదారు రోజుల్లో 70 వేల మెట్రిక్ టన్నులు కొనడం సాధ్యమేనా?
- మిల్లర్లు సహకరిస్తే తప్ప ఈ నెలాఖరులోగా టార్గెట్ పూర్తి చేయడం కష్టమే

ఇందారంలోని ఓ రైస్ మిల్లు ముందు అన్‌లోడింగ్ చేయకపోవడంతో నిలిచిఉన్న ఏడు లారీలు

మంచిర్యాల, మే 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లాలో ధాన్యం సేకరణలో సవాలక్ష సమస్యలు ఎదురవుతున్నాయి. మిల్లర్లు తమ స్వలాభం కోసం కొనుగోళ్లకు సహకరించకపోవడంతో ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్న లక్ష్యం నెరవేరేలా లేదు. గతేడాది జిల్లాలో 272 కేంద్రాల ద్వారా కొనుగోళ్లు చేపట్టగా, ఈ మేడాది 286 కేంద్రాల ద్వారా సేకరిస్తున్నారు. ఏప్రిల్ 1న జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు మొదలయ్యాయి. ఈ సీజన్‌లో 1.80 లక్షల టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉండగా, ఇప్పటి వరకు 1,08,782 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. ఈ ఐదారు రోజుల్లో ఇంకా 70 వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం సాధ్యమయ్యేలా లేదు.

మిల్లర్లు మాట వింటలేరు..

మంచిర్యాల జిల్లాలో 19 పారా బాయిల్డ్ రైస్ మిల్లులకు ట్యాగింగ్ ఇచ్చారు. దాదాపు 80వేల మెట్రిక్ టన్నుల నుంచి 90 వేల మెట్రిక్ టన్నుల వరకు ఈ మిల్లులకు తరలించి, మిగిలిన ధాన్యాన్ని పెద్దపల్లి జిల్లాలోని మిల్లులకు తరలించాలనుకున్నారు. కానీ జిల్లా మిల్లుల లక్ష్యం పూర్తి కాకుండా 45 మిల్లులకు ధాన్యం తరలించేందుకు ట్యాగింగ్ ఇచ్చారు. ఎందుకు అలా చేశారో అర్థంకానీ పరిస్థితుల్లోనే ముందేమో రా రైస్ మిల్లులకు ధాన్యం ఇవ్వమని చెప్పిన అధికారులే, జిల్లాలోని 13 రా రైస్ మిల్లులకు ట్యాగింగ్ ఇచ్చారు. ఇక కొనుగోళ్లు వేగవంతం అవుతాయని రైతులు, కేంద్రాల నిర్వాహకులు ఆశపడేలోగానే.. పెద్దపల్లి మిల్లులకు ధాన్యం పంపించవద్దంటూ గురువారం రాత్రి అధికారులు మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. దీంతో మంచిర్యాల జిల్లాలోని 32 మిల్లులకు ధాన్యం పంపాల్సి వస్తుంది. ఇక్కడ కొస మెరుపు ఏమిటంటే అధికారులు చెప్పినా.. మంచిర్యాల జిల్లాలోని మిల్లర్లు మాత్రం ధాన్యం దించుకోడానికి ఆసక్తి చూపడం లేదు. 40 కిలోలు ఉండాల్సిన బస్తాలో 42 లేదా 43 కిలోలు ఉంటేనే తీసుకుంటామంటూ కొందరు మిల్లర్లు చెబుతుండడంతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు నోరెళ్లబెడుతున్నారు. ఈ మేరకు బస్తాలు కటింగ్ పెట్టుకుంటామంటేనే అన్‌లోడ్ చేస్తామని, లేకపోతే ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండంటూ కొందరు మిల్లర్లు తెగేసి చెబుతున్నారు.

ఉదాహరణకు ఒకటి..

ధాన్యం కొనుగోలు సెంటర్ల నిర్వాహకులు ఉండే వాట్సాప్ గ్రూప్‌లో శుక్రవారం జిల్లా ఉన్నతాధికారి.. మంచిర్యాల జిల్లాలోని శివరామకష్ణ ట్రేడర్స్(మిట్టపల్లి), శ్రీరామచంద్ర పీబీ ఓఆర్(గుల్లకోట), వేంకటేశ్వర పీబీఆర్ఎం(కన్నెపల్లి), ఎస్ఆర్ఎమ్ ఇండస్ట్రీస్, హనుమాన్ ఆగ్రో ఇండస్ట్రీస్ (మంచిర్యాల), జయలక్ష్మి ఇండస్ట్రీస్, వరలక్ష్మి ఇండస్ట్రీస్ (ఇందారం)లకు ధాన్యం పంపాలంటూ మెస్సేజ్ చేశారు. ఈ మిల్లుల ధాన్యం దిగుమతి కోటా ఇంకా పూర్తి కాలేదంటూ స్పష్టంగా అందులో పేర్కొన్నారు. అలా అధికారులు చెప్పడంతో భీమారం మండలంలోని ఓ కేంద్రం నిర్వాహకుడు 1050 బస్తాల్లో ఉన్న లారీని ఇందారంలోని జయలక్ష్మి ఇండస్ట్రీస్‌కు పంపించారు. కానీ మిల్లు యజమాని లారీని మిల్లులోపలి నుంచి బయటికి తీసుకెళ్లాలంటూ డ్రైవర్‌కు సూచించాడు. అన్‌లోడింగ్ చేసుకోమని చెప్పాడు. విషయం తెలుసుకున్న కొనుగోలు కేంద్రం సెంటర్ నిర్వాహకుడు ఫోన్ చేయగా.. ఎవరిని అడిగి లోడ్ పంపించారంటూ సదరు మిల్లర్ ఫైర్ అయ్యాడు. మా మిల్లుకు రావాల్సిన ధాన్యం కంటే ఎక్కువ ధాన్యం వచ్చిందని, ఎట్టి పరిస్థితుల్లో అన్‌లోడ్ చేయమని చెప్పారు. అధికారులు చెప్పారంటూ కేంద్రం నిర్వాహకుడు ఎంత చెప్పినా మిల్లర్ వినలేదు. నాకు ఎవ్వరూ చెప్పలేదని.. నేను లోడ్ దింపలేనంటూ తేల్చి చెప్పాడు. వెంటనే సదరు కేంద్రం నిర్వాహకుడు అధికారుల దృష్టికి విషయం తీసుకెళ్లాడు. అధికారులకు ఫోన్ చేసి ఎత్తలేదని, వాట్సాప్ గ్రూప్‌లో మెస్సేజ్ చేసినా స్పందించ లేదని చెప్పారు. ఈ ఒక్క రోజు చూసి రైతులను తీసుకెళ్లి మిల్లుముందు ధర్నాకు దిగుతామంటూ సదరు సెంటర్ నిర్వాహకుడు తెలిపాడు. ఇలాంటి పరిస్థితుల్లో ధాన్యం సేకరణ నెలాఖరులోగా పూర్తి చేయడం ఎలా సాధ్యమవుతుందంటూ సివిల్ సప్లయ్ డిపార్ట్‌మెంట్‌లో పని చేసే అధికారులే అంటున్నారు. మిల్లర్లు సహకరించకపోతే ధాన్యం సేకరణకు ఇబ్బందులు తప్పవంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అధికారులు ఎలా ముందుకు వెళ్తారో వేచి చూడాల్సి ఉంది.

ఎల్లూరు కేంద్రం వద్ద ధాన్యం ఆరబెడుతున్న రైతు

● మిల్లర్ల మిలాఖత్

- ఎల్లూరు సెంటర్‌లో ఐదు రోజులుగా నిలిచిన కొనుగోళ్లు
- పడిగాపులు కాస్తున్న రైతన్నలు
- దళారులకు లాభం కలిగించేలా వ్యవహరిస్తున్న నిర్వాహకులు
- క్వింటాలుకు 8 నుంచి 10 కిలోల కోత
- కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్
- ఆందోళనలో అన్నదాతలు

మిల్లర్లు వద్దన్నరని వడ్లు కొనట్లే..

ఎల్లూరు కొనుగోలు కేంద్రంలో ధాన్యం సంచులు

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/పెంచికల్‌పేట్, మే 24 : పెంచికల్‌పేట్ మండలం ఎల్లూరు ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఐదు రోజులుగా కొనుగోళ్లకు బ్రేక్ పడింది. రైతులు సుమారు ఎనిమిది లోడ్ (4800 బస్తాలు-1290 క్వింటాళ్లు)ల బస్తాల ధాన్యాన్ని విక్రయానికి ఇక్కడికి తీసుకురాగా, మిల్లర్లు వద్దన్నరన్న సాకుతో నిర్వాహకులు సేకరణ నిలిపివేయడం గందరగోళానికి దారి తీస్తున్నది. అన్నదాతలు వడ్లను ఆరబెట్టి తేమ శాతం తగ్గించి బ్యాగుల్లో నింపి మరీ పడిగాపులు కాయాల్సి వస్తున్నది. మిల్లర్లు, నిర్వాహకులు మిలాఖత్ అయి తమ స్వలాభం కోసం ఏదో ఒక సాకు చెప్పి కొనుగోళ్లు నిలిపివేశారు. ఇక ఆకాశంలో మబ్బులు పడుతుండగా, రైతులు కంగారు పడి నష్టానికి అమ్ముకునే పరిస్థితిని తీసుకొస్తున్నారు. ఇప్పటికే ఓ రైతు వద్ద క్వింటాలుకు 8 నుంచి 10 కిలోల చొప్పున కోత విధించి కొనుగోలు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కలెక్టర్ ఆదేశించినా..

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి.. ప్రతి గింజనూ కొనాలి.. అని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదేశిస్తున్నా రైస్ మిల్లర్లు, దళారులు బేఖాతర్ చేస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో క్వింటాల్‌కు రూ. 2300 చొప్పున కొనాలి. కానీ.. ఏదో ఒక సాకు చెబుతూ సేకరణ చేపట్టకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. లారీలు పంపించకపోవడం.. తప్పతాలు పేరిట ఇబ్బందులు పెట్టడం.. క్వింటాలుకు 8 నుంచి 10 కిలోల చొప్పున కోత విధించే దుస్థితి తీసుకురావడం.. బయట దళారులకు విక్రయించేలా పరిస్థితి తీసుకురావడంవంటివి చేపడుతున్నారు. ఎల్లూరులోనే గాక కొండపల్లి, గొండ్లపేట్‌లో సెంటర్‌ల లోనూ ఇదే పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక వర్షాలు పడే అవకాశమున్నందున ఏం చేయాలో తోచక అన్నదాతలు తలలు పట్టుకుంటున్నారు.

ఇంకెన్ని రోజులైతదో..

సుమారు 40 క్వింటాళ్ల ధాన్యం అమ్మేందుకు ఎల్లూరుకు తీసుకొచ్చిన. ఇప్పటికి ఐదు రోజులైతంది. కాంటా పెట్టలేదు. ఎందుకని అడిగితే లారీలు వస్తలేవంటున్నరు. మిల్లర్లు వడ్లు కొనద్దని చెప్పినంటున్నరు. ధాన్యాన్ని పూర్తిగా ఆరబెట్టి తేమలేకుండా చేసిన. రాత్రీ..పగలు ఇక్కడే కావలి కాస్తున్న. ఇంకెన్ని రోజులైతదో మరి.

- దుర్గం దేవాజీ, రైతు

వడ్లు కొంటలేరు

నాలుగు రోజుల కింద సుమారు 30 క్వింటాళ్ల వడ్లు ఎల్లూరు కొనుగోలు కేంద్రానికి తెచ్చిన. నాతోపాటు మస్తు మంది రైతులు ఇక్కడే పడిగాపులు కాస్తున్నరు. వడ్లు బస్తాల్లో నింపి ఉంచినం. ధాన్యం ఎందుకు కొంటలేరని అడిగితే మిల్లర్లు వద్దన్నరని చెబుతున్నరు. రైతులంతా దళారులకు వడ్లు అమ్ముకునేలా చూస్తున్నరు.

- గోలేటి శంకర్, రైతు

మిల్లర్లు వద్దని చెప్పారు

మిల్లర్లు ధాన్యం పంప వద్దని చెప్పారు. అందుకే ధాన్యం కొనుగోళ్లు నిలిపివేశాం. మిల్లుల్లో లారీలు ఖాళీవేయడం లేదు. లారీలు వస్తేనే కద ఇక్కడ ధాన్యం కొనుగోలు చేసేది. లారీల కొరత చూపించి మిల్లర్లు ధాన్యం ట్రాన్స్‌పోర్టు సమస్యలు సృష్టిస్తున్నారు. ఇక్కడ దాదాపు 8 లోడ్‌ల ధాన్యం ఉంది. వాటిని కొనుగోలు చేయాల్సి ఉంది.

- వెంకటేశ్వర్ గౌడ్, ఎల్లూరు కేంద్రం నిర్వాహకుడు

ఆ వంతెనలపై వణుకే

కడెం ప్రధాన కాలువ వెంబడి ఉన్న వంతెనలు	20
కాలువను ఆనుకొని ఉన్న గ్రామాలు	40
డిస్ట్రిబ్యూటరీ కాల్వలు	42
ప్రధాన కాలువ పొడవు	72 కి.మీ
నిత్యం ఈ రూట్లో ప్రయాణించే రైతులు, కూలీలు	20 వేల మంది

● ప్రమాదాలకు కేరాఫ్‌గా కడెం కాలువపై నిర్మించిన వారధులు ● ఏళ్ల కేళ్లుగా మరమ్మతులు కరువు
● ప్రాణాలు పోతున్నా పట్టింపు కరువు ● ఇటీవల ట్రాలీ బోల్తాపడి ఒకరి మృతి.. పలువురికి గాయాలు

మామిడిపెల్లి సమీపంలో వాగుపై నిర్మించిన వంతెనకు ఇరువైపులా ఊడిపోయిన ఇనుప గొట్టాలు

దండేపల్లి, మే 24 : మంచిర్యాల జిల్లాలోని కడెం ప్రధాన కాలువపై నిర్మించిన పలు వంతెనలు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోక ప్రమాదాలకు కేరాఫ్‌గా నిలుస్తున్నాయి. కడెం జలాశయం ప్రధాన కాలువకు ఇరువైపులా రహదారి నిర్మించారు. మధ్యలో వాగులు అడ్డంగా ఉన్నచోట వంతెనలు నిర్మించారు. ఇరువైపులా రక్షణ గోడలు ఏర్పాటు చేయగా, వాటికి ఏర్పాటు చేసిన ఇనుప గొట్టాలు దొంగల పాలయ్యాయి. కేవలం రాడ్లు మాత్రమే మిగిలి ఉండి ప్రమాదకరంగా మారాయి. ఈ రహదారి గుండా రైతులు, కూలీలు తరుచూ ప్రయాణిస్తుంటారు. ఏమాత్రం ఆదమరిచినా వాహనాలు కడెం కాలువ, వాగులో పడిపోయే అవకాశముంది. ఇక్కడ పలువురు గాయపడ్డ ఘటనలు ఉన్నాయి. ఇటీవల దండేపల్లి మండల కేంద్రానికి చెందిన ఉపాధి కూలీల ట్రాలీ కడెం ప్రధాన కాలువకు అనుసంధానంగా ఉన్న డిస్ట్రిబ్యూటరీ కాలువలో పడిపోగా, ఓ మహిళ చనిపోవడంతో పాటు పలువురు గాయపడ్డారు.

ఈ దారి గుండా ప్రయాణించేది రైతులే..

దండేపల్లి మండలం తాళ్లపేట, రాజుగూడ, మాకులపేట, దమ్మన్నపేట, లింగాపూర్, తానిమడుగు వద్ద ఉన్న వంతెనలతో పాటు మిగతా చోట్ల ఉన్న బ్రిడ్జిలను సైతం మరమ్మతులు చేయాల్సిన అవసరముంది. కడెం ప్రధాన కాలువకు అవతలి వైపు అటవీ ప్రాంతం, ఇటువైపు పొలాలు ఉన్నాయి. అటవీప్రాంతంలో పలు చోట్ల పొలాలు కూడా ఉన్నాయి. రైతులు, వ్యవసాయ కూలీలు ద్విచక్ర వాహనాలు, ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లపై నిత్యం ఈ రూట్లో ప్రయాణిస్తుంటారు. అవతలి వైపుకు వెళ్లాలన్నా ఇదే ప్రధాన మార్గం. అలాగే కడెం ప్రధాన కాలువకు ఆనుకొని ఉన్న గిరిజన గ్రామాల ప్రజలు ఈ దారిగుండా రాకపోకలు కొనసాగిస్తుంటారు. గూడాల నుంచి కడెం ప్రధాన కాలువ దాటుకొని రావాలంటే ఈ దారిగుండానే రాకపోకలు కొనసాగించాల్సిందే. దీనికి తోడు రహదారి మార్గం కూడా అధ్వానంగా ఉండడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శిథిలావస్థకు చేరిన వంతెనలతో పాటు, రహదారులకు మరమ్మతులు చేసి ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

తాళ్లపేట సమీపంలో ప్రమాదకరంగా..

ఇటీవల బోల్తా పడిన ఉపాధి కూలీల ట్రాలీ

95 కిలోల నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

తాండూర్/బెజ్జూర్, మే 24 : మంచిర్యాల జిల్లా తాండూరు మండలం కొత్తపల్లిలో పోలీసులు, వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నారు. కొత్తపల్లికి చెందిన ఎర్రవోతు రాజు ఇంటిలో తనిఖీ చేయగా రూ. 50 వేల విలువైన 25 కిలోల నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడ్డడట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం రోల్లపాడులో ఉంటున్న ప్రకాశం జిల్లా పున్నూర్ గ్రామానికి చెందిన తిరుమలశెట్టి రామకృష్ణ దగ్గర కొనుగోలు చేసినట్లు రాజు తెలిపాడు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం సోమిని గ్రామానికి చెందిన తొర్రెం ప్రశాంత్ వద్ద 70 కేజీల నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపారు. వీటి విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని తెలిపారు. ఎస్ఐ వెంకటేశ్, సిబ్బంది రమేశ్, మధు, వెంకటేశ్, తదితరులు ఉన్నారు.

కేంద్ర బృందం సభ్యులతో మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్, మే 24 : అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా యంత్రాంగం పనిచేస్తున్నదని కలెక్టర్ సంతోష్ అన్నారు. శుక్రవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో నోడల్ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, రీజినల్ మాస్టర్ ట్రైనర్ ప్రభాకర్ స్వామితో కలిసి అసిస్టెంట్ సెక్షన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు పలు గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటించిందని, ప్రజల స్థితిగతుల పై పరిశోధించిందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు చురుకుగా ఉండేందుకు ప్లేస్కూల్ తరహాలో ఏర్పాట్లు చే యాలని కేంద్రం సభ్యులు సూచించారుని, అందుకనుగుణంగా చర్యలు తీసుకుంటామ ని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా మారుమూల గ్రామాలకు సైతం పైపులైన్లు విస్తరించి ఇంటింటికీ తాగునీరు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

ఆసిఫాబాద్ టౌన్ ,మే 24 : నకిలీ పత్తి విత్తనాలు అమ్మితే పీడీయాక్టు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో విత్తనాలు, ఎరువుల విక్రయాలపై డీలర్లు, వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులకు నిర్వహించిన సమావేశంలో ఎస్పీ సురేశ్‌కుమార్, అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు, ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి క్రిష్ణారెడ్డితో కలిసి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులు నష్టపోకుండా వ్యవసాయ శాఖ పర్యవేక్షణలో నాణ్యమైన విత్తనాలు అందించాలన్నారు. నకిలీ, కాలంచెల్లిన విత్తనాలు, నిషేధిత పురుగులమందులు అమ్మితే సహించేది లేదని, పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. డీలర్లు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని, ప్రతి దుకాణం ఎదుట ఎరువులు, విత్తనాల ధరల పట్టికలు ఏర్పాటు చేయాలని సూచించారు. డీలర్ షాప్ లైసెన్స్ వివరాలను ప్రదర్శించాలని చెప్పారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విత్తనాలు, ఎరువులను విక్రయించాలన్నారు. విత్తనాలు, ఎరువుల నిల్వల వివరాలను రోజువారీగా రిజిష్టర్లలో పొందుపరచాలని చెప్పారు. రైతులు విత్తనాల ఖాళీ సంచులను పంట కాలం పూర్తయ్యే దాకా భద్రపరుచుకోవాలని, ఒకవేళ రైతు నష్టపోయినట్లయితే ఆయా కంపెనీల నుంచి నష్టపరిహారం పొందేందుకు అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, వ్యవసాయ శాఖ అధికారులు, విస్తరణాధికారులు, డీలర్లు, ఫెర్టిలైజర్స్ యజమానులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తవ్వాలి

జైనూర్ మే 24: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అధికారులను ఆదేశించారు. శుక్రవారం జైనూర్, గౌరీ, డబోలి ఎంపీయూపీఎస్‌లో చేపడుతున్న ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం గౌరి గ్రామంలో మహిళా సంఘాల కుట్టు మిషన్‌ల కేంద్రాలను పరిశీలించారు. గడువులోగా యూనిఫాంలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ జిల్లా సెక్టోరల్ ఆఫీసర్ భరత్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఈఎంపీలో శ్రీనివాసరెడ్డి, హెచ్ఎం రవీందర్, ఐకేపీ ఏపీఎం సుజాత, మండల విద్యాశాఖ అధికారి కుడ్మెత సుధాకర్, ఏపీవో నగేశ్, పంచాయతీ కార్యదర్శి ఉదయ్‌రాంప్రసాద్, సురేఖ ఉన్నారు.

ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

అభివృద్ధి పనులను పరిశీలించి, సూచనలు చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

కాలినడకన గంగాజలానికి వెళ్తున్న తాటిగూడ ఆదివాసీ గిరిజనులు

భీమన్న దేవుడికి పూజలు

కాసిపేట, మే 24 : తాటిగూడలోని భీమన్న దేవుడికి ఆదివాసీ గిరిజనులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆరాధ్య దేవుడి ప్రతిమలను డోలు వాయిధ్యాల నడుమ కాలినడకన సల్పాలవాగు వద్దకు తీసుకెళ్లి గంగాజలాలతో శుద్ధి చేశారు. పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు చేశారు. తిరిగి స్వగ్రామానికి తీసుకొచ్చారు. అనంతరం ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పటేల్ మడావి శేఖర్, పూజారి మడావి వెంకటేశ్, మడావి రాజు, మడావి గోపాల్, వెలాది అర్జు, సిడం కమలాకర్, సిడం శ్రీనివాస్ పాల్గొన్నారు.